

కళాశాల పరిపాలనలో ఆయనకు బస్బీ అనే హెడ్‌మాష్టరు ఆదర్శం. రాజ్యాన్ని పాలించే రాజయినా సరే కళాశాల ప్రాంగణంలో ఆయనముందు టోపీ తీయవలసిందే గౌరవ సూచకంగా...

# సంసారంలో సరిగమలు

## శ్రీ రావెల సాంబశివరావు

ఓ ఐదేళ్ళపాటు నేను రోసయ్యగారిని చాలా దగ్గరగా చూసాను. ఆగ్రహంలో అనుగ్రహంలో, అమాయకత్వంలో ఆరితేరిన తనంలో, విరసంలో, సరసంలో, బాధలో, బోధలో... ఇలా రకరకాల మూడ్స్‌లో.

నేను అంతకుముందు వారిని గురించి విని ఉన్నానుగాని కలవటం అదే ప్రథమం, వారింటి వద్దనే.

జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాలకు ఆయన తొలి ప్రిన్సిపాల్. ఆయన ప్రిన్సిపాల్ అయిన రెండు సంవత్సరాలకు కళాశాల కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను నియమించే ఆలోచనలు కార్యరూపం దాలుస్తున్నాయి. అమరావతిలో పనిచేస్తున్న నన్ను సూపరింటెండెంట్‌గా నియమించ దలిచారు.

''రేపటినుండి కలిసి కాపురం చేయాలిగా ఓసారి చూసిరా'' అంటూ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాసరనేని సదాశివరావుగారు పంపగా వెళ్ళాను.

స్వకుల పక్షపాతిగా అందరి నోళ్ళలోనానే రోసయ్యగారు ఆపూట ఎందువల్లనో స్వకుల ద్వేషిగా రూపుదాల్చారు. పొట్టగోస్తే అక్షరంముక్క రాని వాళ్ళందర్నీ తమనెత్తిన రుద్దుతున్నారని వాపోయారు. గబగబా లోపలికి వెళ్ళి తుళ్ళూరు ఏకామ్రరాయకవి రచించిన రాజశేఖర శతకం తెచ్చి నాలుగో, అయిదో

పద్యాలు వినిపించారు. అవి ఒక కరణంగారు (రచయిత) ఒక మునసబు గారిని తిడుతూ వ్రాసిన పద్యాలు. అందులో ఏముంటుందో నేను వేరే చెప్పాల్సిందేముందీ?! మచ్చుకు ఒక్కటి వింటారా?

సెర్వుకు యింటిచొమ్ముకను యిసేసముగా తగలేత్తినింక నీ
కర్వుకు బిచ్చెగాండ్లు సరకారు జవానులు గుంపులొత్తె నే
నెర్వక కొల్లబెడ్తిని తలెత్తడు కర్నము సిన్నబోయి నా
పర్వును నోర్వలేక యని బల్కును మూఢుడు రాజశేఖరా.

అలా మునసబు కుదురు మూర్ఖత్వాన్ని కరణంతో కలిసి ఎద్దేవా చేయ సాగారు ప్రిన్సిపాల్‌గారు.

రోసయ్యగారికి స్వకులం వాళ్ళతో రోజూ ఎన్నో చేదు అనుభవాలు కాబోలు. తలబిరుసువాళ్ళు, మాటకుదరని వాళ్ళు, అక్షరాలు గుండ్రంగా రాయలేని వాళ్ళు, అప్పగించిన పని అలాగే వుంచేసేవాళ్ళు, కనీసం సెలవు చీటీ అయినా తప్పుల్లేకుండా రాయలేని మహానుభావులు... ఇలా ఎందరితోనో వేగలేక విసిగి వేసారి పోయారు కాబోలు. అవును ఆయనకు బోలునచ్చదు; గట్టిదనమే కావాలి.

ఆయనను గట్టివాడని ప్రిన్సిపాల్‌గా చేయగలిగినవారు వేరొకతన్ని గట్టివాడని సూపరింటెండెంట్‌ను చేయలేరా? అంతటి రేషనలిస్టుకు ఈ మాత్రం తట్టదా? అదే రోసయ్యగారిలోని తమాషా. ఆలోచనల్ని తమ మనస్సుపై పెత్తనం చేయనివ్వరు. తామే ఆలోచనలపై పెత్తనం చేయటానికి ముందుంటారు చాలాసార్లు. అటువంటి సందర్భాలలో యిబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చేది. అంతకుముందు బాగానే ఉండేవాళ్ళు ప్రిన్సిపాల్ అయిన తరువాత ఇలా మారిపోతారంటారు. కొందరి విషయంలో అది నిజమేనేమో!

రోసయ్యగారు మహా పట్టుదలగల మనిషి. తమ ఇష్టానికి వ్యతిరేకంగా నన్ను సూపరింటెండెంట్‌గా నియమించారనే కసి నేను రోజూ పెట్టే నమస్కారాన్ని కూడా స్వీకరించే స్థితిలో ఆయన్ని ఉంచలేదు ఓ

రెణ్ణెల్లపాటు. పట్టుదల నాకు మాత్రం ఏం తక్కువ ''నేను కుర్చీకి నమస్కారం పెడుతున్నాను'' అనుకొని రోజూ వెళ్ళి నమస్కారం పెట్టేవాణ్ణి. అది నాకు అబ్బిన సంస్కారం. వారు మాత్రం విధిగా ముఖానికి దినపత్రిక అడ్డం పెట్టుకునేవారు. నేను నమస్కరించవలసిన కుర్చీ మాత్రం నాకు కన్పిస్తూనే ఉండేది!

రెణ్ణెల్ల తరువాత అనుకోకుండా ఓరోజువారు గుండ్రంగా వుండేనా చేతివ్రాతనూ, సంతృప్తికరంగావున్నశైలినీ చూడటం తటస్థించింది. నా పట్ల అభిమానం పెరిగింది. ఆయనలో ఆగ్రహం పెరిగినా, అభిమానం పెరిగినా ఓ పట్టానపట్టలేం. కట్టలు తెంచుకుని ప్రవహించాల్సిందే. ఆతరువాత నేను నమస్కారం పెట్టానా లేదా అన్నది ఆయన చూచిందెక్కడ? అలాగని నేను నమస్కారం పెట్టటం మానిందెక్కడ? అయితే నేను విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు పదవి నిర్వహించి పదవీ విరమణ చేసిన తరువాత కూడా నా నమస్కారం కోసం ఎదురు చూసిన ప్రిన్సిపాల్స్ కొందరు లేకపోలేదు! వాళ్ళకు నిరాశే ఎదురయ్యేది. అయితే ప్రిన్సిపాల్స్‌కు మించిన వ్యక్తిత్వాన్ని ప్రోది చేసుకున్న వ్యక్తులకు వాళ్ళకు ఎటువంటి హోదాలు లేకపోయినా నేనిప్పటికీ నమస్కారం పెట్టటం మానింది లేదు. సరే అసలు విషయానికొస్తే రెణ్ణెల్ల తరువాత రోసయ్యగారికి నేను బాగా నచ్చానన్నమాట.

కాలేజీ కార్యాలయంలో మోరకుల్నీ, మోసకారుల్నీ ఏరివేయటం జరిగింది. కార్యాలయంలో ఎవరిపని వాళ్ళు చేసుకోగల స్థితి వచ్చింది. అందుకు ఆయనకు ఆనందమయ్యింది. ఆయనకు ఎంతో విస్మయాన్ని పంచిన మరో విషయమేమంటే ఆఫీసులో ఏ విషయం మీదయినా ''నోట్'' అటయినా, యిటయినా ఎటయినా వ్రాయవచ్చునేది! నులకుండ నైవేద్యంలా కాష్‌బాక్స్ ఇంటికి పట్టుకెళ్ళకుండా గుమస్తాల వద్ద తీసుకున్న కాష్‌కు లెక్కలు వ్రాసి కాష్ బాక్స్‌లో వేసిన పిమ్మట ప్రిన్సిపాల్‌గారు ఇంటికి పట్టుకు వెళ్లే పద్ధతి ప్రవేశపెట్టాం. అదెంత రిస్క్‌తో కూడిన పనో... అయినాసరే అటువంటి రిస్క్ తీసుకోవటం ఆయనకెంతో ఆనందం.

రోసయ్యగారు ప్రిన్సిపాల్‌గా ఉన్నరోజుల్లో అడ్మిషన్లు ఓ ప్రహసనం. నేను సూపరింటెండెంట్‌గా వచ్చేనాటికి మంగళదాస్‌గారి విషయంలో చెలరేగిన పుండు యింకా మానలేదు. కమిటీమెంబర్లు సిఫారసు చేసిన వాళ్ళను చేర్పించేప్పటికి తలప్రాణం తోకకు వచ్చేది. వచ్చిన వాళ్ళు కొందరు పంపినవారికంటే పెద్దగా పెత్తనం చెలాయింపజూసేవాళ్ళు.

రోసయ్యగారు భోజనప్రియులు. అప్పటివరకూ అందరిమీదా చిందులేసి కూడా భోజనం దగ్గర మాత్రం ప్రశాంతంగా కూర్చొని ఎంతో యిష్టంగా తినేవారు. నేనుగబగబా లాగించేసి వారి దగ్గరకు వెళ్ళేప్పటికి వారు పెరుగన్నం కలుపుతూ వుండేవారు.

''అప్పుడే తినటం అయిపోయిందా? మరీ అలా పిట్ట మెతుకులయితే ఎలా?'' అనేవారాయన.

''పిట్ట మెతుకులేమిటండీ... మా ఆవిడ కారియర్‌లో కోడిపలావు పెట్టలేదే'' అనేవాణ్ణి.

ఆయన పెంకులెగిరేలా పకపకా నవ్వేవారు. అవును అప్పట్లో ప్రిన్సిపాల్‌గారి ఆఫీసు పెంకుటి చావడివంటి దాంట్లోనే!

ఒకరోజు నేను ''నాది జైలు భోజనం కదండీ'' అని కవ్వించాను.

''మా ఆవిడ కెమిస్ట్రీ లెక్చరర్ కదండీ... బాలెన్స్‌లో తూచినట్లు తూకంవేసి కారియర్ సర్దుతుంది కొంచెంకూడ మిగలకుండా, తగ్గకుండా. జైళ్ళలోనూ కొలత భోజనమేగా!''

ఇలా నవ్విస్తూ, కవ్విస్తూ మెల్లగా అసలు విషయంలోకి వచ్చేవాణ్ణి.

''ఏమండీ ఈ రోజు మన ప్రెసిడెంట్‌గారు చెప్పిన కేసు కొంచెం తగలేయ కూడదూ'' అనేవాణ్ణి.

''అదా... అది పెట్రోలు పోసి తగలేసినా తగలబడదుగా'' అని రుసరుసలాడేవారు. నేనేమీ మాట్లాడేవాణ్ణికాదు. అటువంటిదే తగలబడని కేసొకటి వారు ఆ ఉదయమో అంతకుముందురోజో తగలబెట్టారనేది నాకు తెలిసి పోయిందని వారికి తట్టగానే ''పట్టుకురాండి తగలేద్దాం'' అనేవారు.

అలాకాకుండా ''నిన్న మీరొకటి చేయలేదా'' అని నేను గనుక తొందరపడి అనుంటే ''నాయిష్టం'' అంటూ అలా అడిగినందుకు గుడ్లురిమి నిలువునా భస్మం చేసేట్లు చూడరూ! కళాశాల పరిపాలనలో ఆయనకు బస్బీ అనే హెడ్‌మాష్టరు ఆదర్శం. రాజ్యాన్ని పాలించే రాజయినా సరే కళాశాల ప్రాంగణంలో ఆయన ముందు టోపీ తీయవలసిందే గౌరవ సూచకంగా.

ఇంగ్లీషు అనే పదాన్ని 'ఈ' అనే అక్షరంతో కాకుండా 'ఐ' అనే అక్షరంతో మొదలు పెట్టిరాసిన అప్లికేషన్ చూసి ఓ పర్యాయం ఎంతగా కోప్పడ్డారో. వీళ్ళ మొఖం, వీళ్ళింకా విదేశాలకు వెళ్తారా అంటూ దరఖాస్తును బుట్టదాఖలు చేసారు. లెక్చరర్లు దిద్దిన ఇంగ్లీషు కాంపోజిషన్లను వారూ పైపైన చూసేవారు. ''చదువుకున్న తలిదండ్రులుంటారు జాగ్రత్త'' అంటూ హెచ్చరికలు చేసేవారు.

జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల చదువు సరిగా సాగలేదు. ఒక గదిలోని విద్యార్థులు ''మాస్ కాపీయింగ్'' చేయసాగారు. విషయం తెలిసిన ప్రిన్సిపాల్‌గారు నంబర్ల అట్ట పుచ్చుకొని బయలు దేరారు. అప్పటికి గదులకు కిటికీలు పెట్టిలేవు. కంతలే. ప్రిన్సిపాల్‌గారిని చూసి ఆ గదిలోని పిల్లలు కిటికీ కంతల్లోంచి సమాధాన పత్రాలతోసహా ఉడాయించారు. సూట్‌లోవున్న ప్రిన్స్‌పాల్‌గారు వాళ్ళ వెంట పరుగెత్త సాగారు. పిల్లలు జొన్న చేలోకి తప్పుకున్నారు.

నేను ప్రిన్సిపాల్‌గారిని వెనక్కు తీసుకొని వచ్చి వారి కుర్చీలో కూర్చోవలసిందిగా కోరాను. మరో లెక్చరర్‌తో నేను విద్యార్థుల వద్దకు వెళ్ళి వాళ్ళు సమాధాన పత్రాలతో పారిపోవటం నేరం అవుతుందనీ, క్రిమినల్ కేసు పెడితే వచ్చే యిబ్బందుల్ని వాళ్ళకు వివరించాను. వాళ్ళు తిరిగి పరీక్ష హాలులోకి వస్తామన్నారు. ఒక షరతుమీద విశ్వవిద్యాలయానికి వాళ్ళమీద ఫిర్యాదు పంపకుండావుంటే. పొలాల్లోకి పరిగెత్తించినందుకు ప్రిన్సిపాల్ గారికింకా కోపం తగ్గలేదు. విశ్వవిద్యాలయానికి ఫిర్యాదు చేయాల్సిందే నన్నారు. ఎవరో నచ్చజెప్పగా చివరకు సరేనన్నారు. విద్యార్థులు జొన్న చేలోనుండి తిరిగి వచ్చారు.

వాళ్ళ సమాధాన పత్రాలు విశ్వవిద్యాలయానికి పంపే సమయంలో ఫిర్యాదుచేస్తూ రాసిన రిపోర్టును సమాధాన పత్రాలతోపంపమన్నారు. ఏం చేయాలి? ''అదేమిటండీ'' అని అడిగితే ''ఏం? రేపు యూనివర్సిటీ వాళ్ళకు ఈ విషయం తెలిసి ఫిర్యాదు ఎందుకు చేయలేదంటే నేనేం సమాధానం చెప్పాలీ'' అంటారేమో. ఎప్పుడయినా ఏవయినా రాజీ ప్రయత్నాలు చేయవలసి వచ్చినపుడల్లా ఆ విషయం గుర్తుకు వచ్చి గిల్టీగా ఫీలవుతాను.

నేను ''కవిరాజు విజయం'' అనే రూపకం ఒకటి రూపొందించాను. అది లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో ప్రదర్శింపబడుతుంది. ముందు వరుసలోకూర్చున్న రోసయ్యగారు రూపకంలోని వ్యంగ్యవైభవానికి ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. అందులో ఒక డైలాగ్ వ్యాకరణానికి సంబంధించింది ''ఇంకానయం... మా రోసయ్య మాస్టారిలా ఉలవల డబ్బామీద అచ్చు 'ఉ'కు బదులు 'వ'కు కొమ్ము యిస్తే అవి ఎడ్లు తినవనీ, కవుఁజులో అరసున్నా ఎగిరిపోతే దాని రుచి చెడిపోతుందనీ అన్నారు కాదు!'' అది విని ఎక్కడ కోపగించు కుంటారోనని ''సారీ మాస్టారూ'' అన్నాను.

''అంటే అన్నావులే... అల్లిక ఏం అల్లిక... పసందుగా ఉంది. మళ్ళీ ఎక్కడన్నా ప్రదర్శిస్తూంటే పిలవండి''అంటూ చిలుమూరు ప్రదర్శనకు అంతదూరం శ్రమపడి వచ్చారు. భార్య చనిపోయినప్పుడు పసిపిల్లవానిలా బావురుమని రోదించటం ఆయన వ్యక్తిత్వంలో అదొక పార్శ్వం. ఆదర్శంగా విధవా వివాహం చేసుకున్నాననే కించిత్తు బడాయి కానరానిచ్చే వారుకాదు.

ఆంగ్లంలోనూ, ఆంధ్రంలోనూ పాండిత్యాన్ని గడించిన రోసయ్యగారు ఆ ఫలాలను ఆంధ్రదేశానికి అందించ వలసినంతగా అందించలేదు. ''వ్రాతబలిగోరును'' అని వారు ఇతరులకు చేసే హెచ్చరికలో వారి వ్రాత బలయిపోతున్న విషయం గమనించలేక పోయాం. ఆయన పట్టుబట్టి వ్రాస్తే పదికాలాలపాటు నిలిచే రచనలు చేయగలిగేవారు.